సాక్షి వికారాబాద్

శనివారం ౹ 30 ౹ సెప్టెంబర్ ౹ 2023



రవాణా భారం

మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే గ్రామీణ విద్యార్థులు బస్సులు లేక అవస్థలు పడుతున్నారు. 8లో▸



పథకాలు దేశానికే ఆదర్శం

సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని మర్పల్లి జెడ్పీటీసీ మధుకర్ అన్నారు. 8లో▸



ప్రజారోగ్యం ప్రశ్నార్థకం

మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు జాబ్‌మేళా

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ సత్య సాయి జ్ఞాన కేంద్రంలో శనివారం సత్యసాయి సేవా సంస్థల యువజన విభాగం ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోరాట యోధుడు పండుగుల సాయన్న

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్‌కుమార్ తదితరులు

పరిగి: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పండుగుల సాయన్న అని మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ అన్నారు. అక్టోబర్ 1న సాయన్న విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి సాయన్న అన్నారు. ఆయన విగ్రహావిష్కరణకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం నాయకులు రాంచంద్రయ్య, రామస్వామి, ముకుంద నాగేష్, బాబు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీగా రవీందర్‌రెడ్డి

అనంతగిరి: జిల్లా అదనపు ఎస్పీగా రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. సీఐడీ విభాగంలో అదనపు ఎస్పీగా పని చేస్తున్న ఆయన్ను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును సీఐడీకి బదిలీ చేశారు.

కేటీఆర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



గిరిజన భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: అక్టోబర్ 5న జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పలు ప్రదేశాలను పరిశీలించారు. మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న గిరిజన భవన్, రైల్వే బ్రిడ్జిని పరిశీలించారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద హెలిక్యాప్టర్ ల్యాండింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను వారు పరిశీలించారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

- జీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింలు



నియామక పత్రం అందుకుంటున్న నూతన కార్యవర్గ సభ్యులు

వికారాబాద్ అర్బన్: రాష్ట్రంలో దివ్యాంగులు దుర్భర జీవితం గడుపుతున్నారని బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్ ఆవరణలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పోతురాజు సుధార్, ఉపాధ్యక్షుడిగా హెచ్ బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా కొత్త జెర్మయ్యను నియమించారు. అనంతరం నర్సింలు మాట్లాడుతూ.. తెలంగాణలో సుమారు 40లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, చాలా మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దివ్యాంగుల హక్కులు సాధనకు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి చెన్నయ్య, సహాయ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు అన్యాక్రాంతం

కబ్జా కోరల్లో మెజార్టీ ఆస్తులు

- తెలిసినా పట్టించుకోని అధికారులు
- జిల్లాలో 2,170 ఎకరాల వక్ఫ్ భూములు
- 2006లో సర్వే చేయించిన ప్రభుత్వం
- నేటికీ వివరాలు వెల్లడికాని వైనం



పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లోని వక్ఫ్ భూములు

వికారాబాద్: జిల్లాలో రోజురోజుకూ వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే మెజార్టీ భూములు కబ్జా కోరల్లోకి వెళ్లాయి. ఈ తతంగం వక్ఫ్ బోర్డు, రెవెన్యూ శాఖ అధికారులకు తెలిసే జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఆరోపణలు వచ్చిన ప్రతి సారీ వక్ఫ్ బోర్డు, రెవెన్యూ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు బురద జల్లుకునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో 2,170 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. అవి చాలా వరకు రికార్డులకే పరిమితమయ్యాయి. ఆయా గ్రామాల్లో పలుకుబడి ఉన్న వ్యక్తుల దర్జాగా కబ్జా చేశారు. మరి కొన్ని చోట్ల సంరక్షకులే యజమానులుగా మారారు. ఇంకొన్ని చోట్ల కాగితాల్లో భూములు ఉన్నా వాస్తవంలో కనిపించడం లేదు. గతంలో వక్ఫ్ భూముల అన్యాక్రాంతంపై పలు ఫిర్యాదు వచ్చాయి. విచారణ చేపట్టిన అధికారులు నివేదికలు సైతం సమర్పించారు. అయితే నేతల నుంచి వస్తున్న ఒత్తిడి.. కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంకా 1958 –64 సర్వేనే ఆధారం

వక్ఫ్ బోర్డు భూములు ఉన్నవెంత ? అవి ఎక్కడెక్కడ ఉన్నాయి? ఎవరి ఆధీనంలో ఉన్నాయి? అనే విషయాలు వక్ఫ్ బోర్డు అధికారులకు కూడా స్పష్టత లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు అవగాహన ఉన్నా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. 1958 – 64 మధ్య వక్ఫ్ భూములపై సర్వే చేశారు. నేటికీ ఆ సర్వేనే ఆధారం. 2006లో మరో సారి సర్వే చేసినా ప్రభుత్వం ఇందుకు సంబంధించిన వివరాలను విడుదల చేయలేదు.

కబ్జా కోరల్లో..

పరిగి మండలం సుల్తాన్‌పూర్ శివారులోని దర్గా వద్ద వక్ఫ్ బోర్డు భూములు ఉన్నాయి. ఇందులో సుమారు 5 ఎకరాలు కబ్జా అయినట్లు తెలిసింది. సంరక్షకుడిగా ఉన్న వ్యక్తే ఆ భూమిని తన పేరున రాయించుకున్నాడు. ఈ విషయాన్ని స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి రెవెన్యూ, వక్ఫ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి వారు నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పరిగి మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 568లో సుమారు 205 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. వాటిలో చాలా వరకు అన్యాక్రాంతం అయ్యాయి. పరిగి మండలం రాపోల్ గ్రామంలో సైతం వక్ఫ్ భూములు కబ్జాకు గురయ్యాయి. ఇదే మండలంలోని నారాయణ్‌పూర్‌లో 24 ఎకరాల భూములు ఉండగా 22 ఎకరాల వరకు కబ్జాకు గురైనట్లు స్థానికులు తెలిపారు. వీటితో పాటు వికారాబాద్, ధారూరు, తాండూరు తదితర మండలాల్లో సైతం వక్ఫ్ బోర్డు భూములు కబ్జాకు గురైనట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు అన్యాక్రాంతం అయిన వక్ఫ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రికార్డుల ప్రక్షాళనలోనూ వెలుగుచూడని వైనం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన సర్వేలో అన్యాక్రాంతమైన భూముల వివరాలు వెల్లడవుతాయని అందరూ భావించారు. కానీ మొదటివిడత సర్వేలో కేవలం లిటిగేషన్ లేని భూములకు సంబంధించి మాత్రమే రెవెన్యూ యంత్రాంగం సర్వే చేపట్టింది. దీంతో వక్ఫ్ బోర్డు భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయనే విషయం తేలలేదు.



కుటుంబ సభ్యులతో కలసి చండీయాగంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి

ప్రజారంజక పాలన రావాలి

- అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి
- తెలంగాణకు త్వరలోనే మంచిరోజులు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కొడంగల్: రాష్ట్రంలో ప్రజారంజక పాలన రావాలని కోరుకుంటున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొడంగల్‌లోని నివాసంలో ఆయన కుటుంబ సభ్యులు మూడు రోజులుగా చండీయాగం నిర్వహిస్తున్నారు. చివరి రోజైన శుక్రవారం రేవంత్ యాగంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే యాగం నిర్వహించానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందాలనేదే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని స్పష్టంచేశారు. త్వరలోనే తెలంగాణకు మంచి రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే తాను ఈ స్థాయికి వచ్చానని, భవిష్యత్తులో కూడా వారి ఆశీస్సులు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. యాగం విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కొడంగల్ నుంచే బీఆర్‌ఎస్ పతనం

కొడంగల్ నుంచే బీఆర్‌ఎస్ పతనం ప్రారంభమవుతుందని రేవంత్ జోస్యం చెప్పారు. ఈ నియోజకవర్గం తనకు పుట్టినిల్లు వంటిదని పేర్కొన్నారు. 2018లో పోలీసులను అడ్డుపెట్టుకొని తనను ఓడించారని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు కూడా అదే కుట్ర చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో ఈసారి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని ప్రకటించారు. ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజల ముందుకు వెళ్తామని తెలిపారు.

‘పట్నం’ ఈఈగా శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీరాజ్ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఇబ్రహీంపట్నంలో డీఈగా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి ఈఈగా పదోన్నతి కల్పించింది. ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన డివిజనల్ కార్యాలయంలో ఈఈగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

● భక్తిశ్రద్ధలతో మిలాద్ - ఉన్ - నబీ



మిలాద్ - ఉన్ - నబీని పురస్కరించుకొని శుక్రవారం వికారాబాద్‌లో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జామా మసీదు నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా అలంపల్లి వరకు సాగింది. - అనంతగిరి

మైసిగండి సన్నిధిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి

కడ్తాల్: మండలంలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చక సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారనే వార్తల నేపథ్యంలో.. శుక్రవారం మైసిగండి మైసమ్మ దేవతను తన ముఖ్య అనుచరులతో కలిసి దర్శించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో ఎంపీపీలు కమ్లీ, అనిత, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, రాంచంద్రయ్యగౌడ్, మల్లయ్య ఉన్నారు.

రైతులందరికీ న్యాయం చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మోమిన్‌పేట: ప్రభుత్వానికి భూములిచ్చిన రైతులందరికీ న్యాయం చేస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ఇటీవల మొబిలిటీ వ్యాలీ కోసం ప్రభుత్వం మండలంలోని ఎన్కతల గ్రామ రైతుల నుంచి భూములు సేకరించిన విషయం తెలిసింది. ఇందుకు సంబంధించిన పరిహారం చెల్లింపులో తమకు అన్యాయం జరిగిందని పలువురు రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం అదనపు కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సర్వే సమయంలో మాకు అన్యాయం చేశారని, పరిహారం తక్కువ ఇచ్చారని పేర్కొన్నారు. కొంత మంది అక్రమంగా పరిహారం పొందారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపించాలని అదనపు కలెక్టరు రైతులను కోరారు. మీ పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వే చేసే సమయంలో పట్టాదారులు, కబ్జాదారులు ఉన్నారని, బాండ్ పేపర్లపై సంతకాలు చేశారని, గ్రామ పంచాయతీ కార్యాలయ బోర్డుపై అర్హుల జాబితాను ఉంచినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని సూచించారు. త్వరలో రైతుల పొలాల గట్లపై ఉన్న చెట్లకు, బావులకు పరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ విజయకుమారి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, కిరణ్‌కుమార్, ఆర్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్

సరస్వతీ నిలయంగా మహేశ్వరం

- అందుబాటులో ఇంటర్, డిగ్రీ, పీజీ, బిజినెస్, లా కాలేజీలు
- కందుకూరులో రేపు మెడికల్ కళాశాలకు శంకుస్థాపన
- రూ.176 కోట్ల అంచనా వ్యయంతో 450 పడకల భవనం
- హాజరు కానున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పరిశ్రమల స్థాపనలోనే కాదు వృత్తి విద్యా కోర్సుల ఏర్పాటులోనూ మహేశ్వరం ముందంజలో ఉంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఇంటర్మీడియెట్, డిగ్రీ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయం కూడా ఇదే నియోజకవర్గంలో ఏర్పాటైంది. తాజాగా పాలిటెక్నిక్, బిజినెస్, డైట్, లా సహా మెడికల్ వంటి వృత్తివిద్యా కోర్సుల ఏర్పాటుతో సరస్వతీ నిలయంగా మారుతోంది. తాజాగా మెడికల్ కాలేజీ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.176 కోట్ల అంచనా వ్యయంతో కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 112లో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మెడికల్ కాలేజీ భవనానికి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సహా విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు హాజరు కానుండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఉన్నత విద్యకు కేంద్ర బిందువుగా..

సాక్షాత్తూ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు కనీసం చదువుకునేందుకు ప్రాథమిక పాఠశాలలు, జూనియర్ కాలేజీలు ఉండేవి కావు. ఉన్నవాటిలోనూ సరైన సదుపాయాలు కనిపించేది కాదు. కొత్త కాలేజీల కోసం విద్యార్థి సంఘాలు తరచూ ఆందోళనలు చేపడుతుండేవి. నియోజకవర్గంలో విద్యా సంస్థలు లేని లోటును పూడ్చాలని మంత్రి భావించారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన వృత్తి విద్యను అందించాలని ఆశించారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. అప్పటి వరకు ఒక్క కాలేజీ కూడా లేని నియోజకవర్గంలో కొత్తగా నాలుగు జూనియర్ కాలేజీలను ప్రారంభించారు. ఒక్క డిగ్రీ కాలేజీ కూడా లేని చోట ప్రస్తుతం మూడు కాలేజీ ఉండడం విశేషం. రెండు పాలిటెక్నిక్ కాలేజీలు ప్రారంభించారు. ఇటీవలే డైట్ కాలేజీ, ఒక పాలిటెక్నిక్ కాలేజీ భవనాలకు శంకుస్థాపన చేశారు. న్యాయ విద్యను చేరువ చేయాలనే ఆలోచనతో లా కాలేజీని మంజూరు చేయించారు. అత్యాధునిక లైబ్రరీని ఏర్పాటు చేయించి, అందులో పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. మన ఊరు, మనబడి పథకంలో భాగంగా శిథిలావస్థకు చేరుకున్న అనేక ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు.

విద్యా సంస్థలకు నిధుల వరద

రూ.6.55 కోట్లతో నాలుగు జూనియర్ కళాశాల్లో నూతన తరగతి గదులు, ప్రహరీ సహా ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో మీర్‌పేట జూనియర్ కాలేజీకి రూ.1.33 కోట్లు కేటాయించగా, కందుకూరు జూనియర్ కాలేజీకి రూ.2 కోట్లు, మహేశ్వరం జూనియర్ కాలేజీకి రూ.1.20 కోట్లు, సరూర్‌నగర్ జూనియర్ కళాశాలకు రూ.2 కోట్లు మంజూరు చేయించగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బడంగ్‌పేట్, మహేశ్వరం పాలిటెక్నిక్ కళాశాలలకు రూ.24 కోట్లు, డైట్ కాలేజీ ఏర్పాటుకు రూ.4 కోట్లు, రూ.4కోట్లతో జిల్లా గ్రంథాలయాలను ఇప్పటికే ప్రారంభించారు. మహేశ్వరం డిగ్రీ కళాశాలకు రూ.కోటి, మోడల్ స్కూల్‌కు రూ.4 కోట్లు మంజూరు చేయించారు. మన ఊరు –మన బడి కింద మొదటి విడతలో 26 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 18 ఉన్నత పాఠశాలలు, మొత్తం 54 ఎంపిక చేసి రూ.16 కోట్లతో 12 రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. మిగిలిన పాఠశాలలకు మరో రూ.9.13 కోట్లు మంజూరు చేయించి, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ఇటీవల రాష్ట్రంలో 16 డిగ్రీ గురుకుల కళాశాలలు మంజూరు కాగా, వీటిలో మన జిల్లాకే రెండు (షాద్‌నగర్ బాలికల, కందుకూరు బాలుర గురుకులాలు) మంజూరయ్యాయి. కేసీతండా పరిధిలో రూ.కోటితో కొత్తగా నిర్మించిన డిగ్రీ కాలేజీ భవనాలను ఇటీవలే ప్రారంభించారు. రూ.1.29 లక్షలతో ఇదే చోట నిర్మించిన మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ భవనాన్ని కూడా ఇటీవలే అందుబాటులోకి తీసుకొచ్చారు.

యూరియా కటకట.. రైతుల తోపులాట!

ధారూరు పీఏసీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. అందుబాటులో ఉన్న 220 బస్తాలను పంపిణీ చేసేందుకు సిబ్బంది రశీదులు అందజేయగా.. క్యూలో నిలబడిన సగం మందికి కూడా రాలేదు. దీంతో తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని కర్షకులు మండిపడ్డారు. – ధారూరు



యూరియా కోసం బారులుదీరిన రైతులు



పీఏసీఎస్ కార్యాలయం వద్ద గుమిగూడిన రైతులు

క్లుప్తంగా

మంత్రిని కలిసిన పీఆర్ అధికారులు



మంత్రిని కలిసిన పంచాయతీరాజ్ అధికారులు

వికారాబాద్ అర్బన్: పంచాయతీరాజ్ శాఖలో ఇటీవల పదోన్నతులు పొందిన ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం మంత్రి మహేందర్ రెడ్డిని కలిశారు. మంత్రిని కలిసినవారిలో రంగారెడ్డి జిల్లా ఎస్సీగా నియమితులైన సురేశ్ చంద్రారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, తాండూరు ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, ఉమేశ్, శ్రీరాములు, డీఈఈ జగన్‌రెడ్డి ఉన్నారు. అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

శోభాయమానంగా గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని పాంబండ క్షేత్ర గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుల్కచర్ల మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి గిరిప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు.

బడి దూరం.. రవాణా భారం

రవాణా భత్యం ఎప్పుడో..?

- విద్యార్థుల ఖాతాల్లో జమకాని వైనం
- పెరిగిన బస్సు, ఆటో ఛార్జీలతో ఇబ్బందులు



పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

దౌల్తాబాద్: రాష్ట్రంలో సర్కారు పాఠశాలలు లేని పల్లెటూళ్లు చాలా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుకోడానికి ఇతర ఊర్లకు వెళ్తున్నారు. ఇలాంటి విద్యార్థులకు నెలకు రూ. 600 రవాణా భత్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయం బాగానే ఉన్నా ఆచరణలో మాత్రం ఇది సాధ్యం కావడం లేదు. దూరాభారం నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రవాణా భత్యం వారి ఖాతాలకు చేరలేదు. సైకిళ్లు కొనుక్కుని, బస్సులు, ఆటోల్లో సర్కార్ బడులకు రాకపోకలు సాగించే విద్యార్థులకు అయ్యే ఖర్చు తల్లిదండ్రులకు భారమవుతోంది. మండలంలో 45 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో 4,565 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. మండలంలో 2023–24 విద్యాసంవత్సరంలో రవాణా భత్యానికి 46 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు విద్యాధికారులు తెలిపారు.

భత్యం కరవు

మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలకు 6 గ్రామాల విద్యార్థులు బస్సులు, ఆటోలు, సైకిల్లలో వచ్చి చదువుకుంటున్నారు. అలాగే సర్పాపూర్, కొడిడ్ గ్రామాలకు చెందిన విద్యార్థులు దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలకు వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. ఇలాంటి విద్యార్థులకు ప్రభుత్వం రవాణా భత్యం కింద నెలకు రూ.600 మంజూరు చేస్తోంది. కానీ రెండేళ్లుగా రవాణా భత్యం అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రెండేళ్లుగా దూరం

రెండేళ్లుగా రవాణా భత్యానికి విద్యార్థులు దూరమయ్యారు. నివాస ప్రాంతానికి పాఠశాల కిలోమీటరు దూరం, ప్రాథమికోన్నత పాఠశాల మూడు కిలోమీటర్లు, ఉన్నత పాఠశాల అయితే కనీసం అయిదు కిలోమీటర్లు దూరంలో ఉండే విద్యార్థులు రవాణా భత్యం పొందేందుకు అర్హులు. కాగా 2023–24 విద్యాసంవత్సరంలో దౌల్తాబాద్ మండల పరిధిలో రవాణా భత్యం కింద 50 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారికి ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదు.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

మలుపులలో మృత్యువు

- ప్రమాదకరంగా మూలమలుపులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- భయాందోళనలో వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: మండలంలోని పలు రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఏక్షణంలో ఏమి జరుగుతుందోనన్న భయం వాహనదారులను వెంటాడుతోంది. గ్రామాల్లో రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు బీటీ రోడ్లు నిర్మిస్తున్నారు. అయితే ఆర్అండ్‌బీ శాఖ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, మూలమలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించక పోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గైడ్‌వాల్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మలుపులున్న రోడ్లు ఇవే...

- మండలంలోని గోకఫసల్‌వాద్ నుంచి తిమ్మారెడ్డిపల్లి మీదుగా బాలంపేట వరకు రోడ్డంతా మలుపులు ఉన్నాయి.
- కుదురుమళ్ల బీటీ రోడ్డు నుంచి హస్నాబాద్ వరకు 3 కి.మీ వరకు మూలమలుపులున్నాయి.
- దౌల్తాబాద్ నుంచి కోస్గి వరకు 18.కిమీ మలుపులతో కూడిన రోడ్డు ఉంది.
- దేవర్‌ఫసల్‌వాద్ నుంచి సుల్తాన్‌పూర్ వరకు మలుపులు ఎక్కువగా ఉన్నాయి.



మలుపులతో ఉన్న బిచ్చాల రోడ్డు

ఉపాధి పనుల చిత్రీకరణ

ధారూరు: జాతీయ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన ఐదుగురు సభ్యుల బృందం శుక్రవారం ధారూరు మండలంలోని కేరెల్లి, నాగసమందర్, మోమిన్‌క లాన్ గ్రామాల్లో ఉపాధి పనులను చిత్రీకరించారు. పథకం విధి, విధానాలు, పనుల కల్పన, పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ముందుగా కేరెల్లి ప్రాథమిక పాఠశాలకు నిర్మించిన ప్రహరీ, పొలాలకు వెళ్లే రోడ్డును చిత్రీకరించారు. తర్వాత నాగసమందర్ గ్రామంలో టైలరింగ్‌లో శిక్షణ తీసుకున్న సభ్యుల గురించి, డ్వాక్రా భవనంలో టైలరింగ్ షాపును సందర్శించారు. మోమిన్‌కలాన్ గ్రామంలో ఉపాధి పనులను వివరించే కళాజాత బృందంపై ఉపాధి కూలీలకు కల్పిస్తున్న అవగాహన తీరుపై చిత్రీకరించారు. జాతీయ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బృందం అధికారి అనుపమ్ శ్రీవాస్తవ, సభ్యులు హసన్ ఇమాం, దిలీప్ కుమార్, సర్పంచులు నర్సింహారెడ్డి, చంద్రకళ, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీఓ షఫీఉల్లా, ఏపీఓ సురేశ్, వికారాబాద్ డీఆర్‌డీఏ ఈసీ సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను చిత్రీకరిస్తున్న బృందం

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

జెడ్పీటీసీ మధుకర్

మర్పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని మర్పల్లి జెడ్పీటీసీ మధుకర్ అన్నారు. శుక్రవారం మర్పల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ గణేష్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లయ్య, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, సహకార సంఘం డైరక్టర్ యాదయ్య తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న మధుకర్, తహసీల్దార్

స్థలం కేటాయించండి

పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు, గౌడ్ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని మండల గౌడ్ సంఘం అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, జెడ్పీటీసీ మధుకర్‌తో పాటు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

తవ్వారు.. వదిలేశారు

- కలుషితమైతున్న తాగునీటి పైపులైన్
- ఆందోళనలో గ్రామస్తులు

పెద్దేముల్: లీకేజైన తాగునీటి పైపులైన్‌ను తవ్వి పది రోజులు దాటినా ఎవరూ పట్టించుకోక పోవడంతో నీరు కలుషితమై రోగాల బారిన పడే అవకాశం ఉందని పెద్దేముల్ మండల ఖానాపూర్ గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి యశ్వంత్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పైపులైన్ పక్కన సెప్టింక్ ట్యాంకు ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఖానాపూర్‌లో పైపులైన్‌ను తవ్వి వదిలేసిన అధికారులు

అదుపు తప్పితే అంతే

వికారాబాద్ అర్బన్: నిత్యం పదుల సంఖ్యలో అంబులెన్స్‌లు, రోగులను తీసుకొచ్చే వాహనాలతో బిజీగా ఉండే వికారాబాద్ ఏరియా ఆస్పత్రి ముందు ప్రాంగణం అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడి అంబులెన్స్‌లు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడినప్పుడు ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇక్కడి పరిస్థితులు మరిన్ని ప్రమాదాలు తెచ్చిపెట్టేలా ఉన్నాయి. రోజుకు వందల మంది వచ్చే ఆస్పత్రి ముందు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతల్లో మట్టి పోయించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని రోగులు కోరుతున్నారు.



వికారాబాద్ ఏరియా ఆస్పత్రి ముందు ఏర్పడిన గుంతలు

రుణమాఫీ రూ.3.5 కోట్లు

- దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తాం
- ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: 684 మంది రైతులకు రూ. 3.5 కోట్ల రుణమాఫీ చేశారని పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సర్వసభ్య సమావేశం శుక్రవారం శేరిగూడలోని కార్యాలయ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 929 మంది అర్హుల్లో 684 మంది రైతులకు రుణమాఫీ చేశారన్నారు. మిగతా 245 మంది రైతులకు త్వరలో చేయనున్నట్లు చెప్పారు. రూ. 2కోట్ల దీర్ఘకాలిక రుణాలను ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటను నిల్వచేసుకునేందుకు ఇటీవల ప్రారంభించిన 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ సిద్ధంగా ఉందన్నారు. అందులో నిల్వ చేసిన ధాన్యం విలువను బట్టి 80 శాతం రుణాన్ని రైతులకు అందజేస్తారని సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ శ్యామ శంకర్, సీఈఓ గణేశ్, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట

మహేశ్వరం: మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో మైనార్టీ భవన్‌కు స్థలం కేటాయించినందుకు మంత్రికి ముస్లింలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. మండల కేంద్రంలో ముస్లిం కమ్యూనిటీ హాల్, ఈద్గా, దర్గా, మసీదుల నిర్మాణానికి నిధులు తీసుకొచ్చామన్నారు. దళితులు, గిరిజనులు, బీసీల్లోని అన్ని కులాలకు భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయించి రూ.10 నుంచి కోటి రూపాయాల వరకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎంఏ సమీర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, ఎంఏ ఫరీద్, అజామ్, హాజీబాబ, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త విచారణ

తాండూరు రూరల్: ఓ భూమి విషయమై లోకాయుక్త అధికారి శుక్రవారం విచారణ చేపట్టారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు మండలం చెంగోల్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 246, 247లో బిల్డింగ్ నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి సరితారెడ్డి అనుమతి ఇచ్చారని, లే అవుట్ లేకుండా సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారని న్యాయవాది సైదయ్య తెలంగాణ రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఈ ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ అధికారి విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి, సబ్‌రిజిస్ట్రార్ నిబంధనాల ప్రకారమే అనుమతి ఇచ్చినట్లు విచారణలో తేలిందన్నారు. అయితే విచారణపై న్యాయవాది అసంతృప్తి వ్యక్తం చేశారు.

పదోన్నతులు కల్పించాలి

బొంరాస్‌పేట: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, గోపాల్ డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం టెట్ అర్హత సాధించి ఉండాలని 2010 నుంచి తప్పనిసరిగా ఉండగా.. అంతకు ముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి టెట్‌కు సంబంధం లేదన్నారు. వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. లేదా టెట్ ఉత్తీర్ణతకు ఐదేళ్ల గడువు ఇవ్వాలన్నారు. అలాగే 2010 తర్వాత నియమితులైన ఉపాధ్యాయులకు సీనియారిటీ, టెట్ అర్హత మేరకు పదోన్నతులు కల్పించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

దోమ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలంలోని కొండాయపల్లి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి(28) ట్రాక్టర్ డ్రైవర్. కృష్ణమూర్తి నెల రోజుల క్రితం ట్రాక్టర్‌పై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కోలుకున్న బాధితుడు మద్యం మత్తులో రెండు రోజుల క్రితం నీటి కుంటలో పడ్డాడు. కుటుంబసభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం నారాయణపేట జిల్లాలోని కోస్గి ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకుపోవాలని సూచించారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా కృష్ణమూర్తి మార్గమధ్యలో మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో మేలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా

ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా

యాలాల: రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయంతో మేలు జరుగుతుందని ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 'కాగ్నా జల రైతు ఉత్పత్తిదారుల సంస్థ' మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన రైతు సంస్థ అభివృద్ధి చెందాలన్నారు. సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారని, సంస్థ లాభాల బాటలో పడాలంటే మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గతంలో సంస్థ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, చైర్మన్ శివయ్య, సర్పంచ్‌లు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ రవీందర్, సంస్థ డైరెక్టర్లు శరణుభూపాల్, మల్లికార్జున్, హన్మంతు, శంకరమ్మ, రాజేందర్ తదితరులు ఉన్నారు.

'కాలగమనంలో' పెద్ద సైకిల్

ధారూరు: పాతరోత కొత్త వింతగా ఉంది నేటి పరిస్థితి. కాలానికి అనుగుణంగా సమాజంలో మార్పులు వస్తున్నాయి. ఆధునిక కాలానికి తగినట్లుగా మార్కెట్లలో వివిధ రకాలు సైకిళ్లు దర్శనమిస్తున్నాయి. ఎన్ని రకాల సైకిళ్లు అందుబాటులోకి వచ్చినా.. ఆనాటి గుర్తులను కొందరు పదిలంగా దాచుకుంటున్నారు. నాటి సైకిళ్లు క్రమంగా కనుమరుగైపోతున్నాయి. శుక్రవారం ధారూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధుడు బీడీ కాలుస్తూ దర్జాగా సైకిలు తొక్కుకుంటూ పోలీస్‌స్టేషన్ ముందు నుంచి వెళ్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.



సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడు

ఫిజిక్స్‌లో స్వాతికి డాక్టరేట్



మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ వికారాబాద్ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న దాసరి స్వాతి డాక్టరేట్ అందుకున్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా ఆమె పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లోని ఐఎస్‌బీఎం యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీ చేయడంతో తన బోధనసుభవంతో, బోధన పటిమతో విద్యార్థుల, అధికారుల మన్ననలు పొందారు. ఎంతో మంది విద్యార్థులకు ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో పీజీలో ప్రవేశం పొందడానికి తను కోచింగ్ ఇచ్చారన్నారు. డాక్టర్ ఎన్ కుమారస్వామి పర్యవేక్షణలో 'ఎక్స్ ఫ్లోరింగ్ మల్టీ ఫంక్షనల్ ప్రాపర్టీస్ ఆఫ్ మ్యాగ్నెట్ బెస్ట్ మల్టీ ఎరాయిక్స్ ఇన్ సైడ్స్ ఫ్రమ్ స్ట్రక్చర్‌లో స్పెక్ట్రోస్కోపిక్ పై ఎలక్ట్రిక్ అండ్ మ్యాగ్నటిక్స్ ప్రాపర్టీస్' అనే అంశంపై ఛతీస్‌ఘడ్‌లో ఐఎస్‌బీఎం యూనివర్సిటీలో సిద్ధాంత గ్రంథం సమర్పించి పీహెచ్‌డీ పట్టా పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ అభినందించారు.

క్రీడలతో ఆరోగ్యం

తలకొండపల్లి: క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వాలీబాల్ అండర్–14, 17 బాల బాలికలకు కడ్తాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు డ్రెస్ కోడ్ ఇవ్వాలని పీఈటీలు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తక్షణమే స్పందించి క్రీడాకారులకు చేయూతనందిస్తామని హామీఇచ్చారు. అనంతరం డ్రెస్ కోడ్ నిమిత్తం రూ.50 వేలను పీఈటీ సుశీలకు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.